సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం। 11। జూన్। 2024



చీనీ టన్ను రూ.38 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,204 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



జీవాలకు కేరాఫ్ కొత్త చెరువు
కొత్తచెరువు మార్కెట్‌యార్డు గొర్రెలు, మేకల విక్రయాల్లో జిల్లాలోనే తొలిస్థానంలో నిలుస్తోంది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు జీవాలు ఎగుమతి అవుతున్నాయి.

8లో

గరిష్టం/కనిష్టం
34.5°/21.4°

జిల్లావ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రజా మన్ననలు పొందాలి
- పదోన్నతి పొందిన ఏఎస్‌ఐలకు ఎస్పీ మాధవరెడ్డి సూచన



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నజీర్ అహమ్మద్

పుట్టపర్తి టౌన్‌: విధులు సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజల్లో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. సీకేపల్లి, 'కియా' పోలీస్‌స్టేషన్లలో ఏఎస్‌ఐలుగా పనిచేసిన సూర్యనారాయణ, నజీర్‌అహ్మద్ ఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు. సోమవారం వారు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు పాత్ర కీలకమని, విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

స్పందన అర్జీలన్నీ పరిష్కరించాలి: ఎస్పీ
పుట్టపర్తి టౌన్‌: 'స్పందన'లో అందే అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తొలిసారి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి 6 పిటీషన్లు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్పందనలో అందే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీహర్షతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ డ్యాం కళకళ



బొమ్మనహాళ్‌: భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం కళకళలాడుతోంది. జిల్లా ప్రజలకు హెచ్చెల్సీ (ఎగువ) కాలువ ద్వారా తాగు, సాగు నీరందించే ఈ జలాశయానికి కొన్ని రోజులుగా ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. సోమవారానికి ఇన్‌ఫ్లో 4,817 క్యూసెక్కులుగా నమోదైంది. అవుట్‌ఫ్లో 10 క్యూసెక్కులుంది. డ్యాం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.581 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1581.07 అడుగుల వద్ద 5.012 టీఎంసీల నీటి నిల్వతో 280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

29న జాతీయ లోక్ అదాలత్



ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని కోర్టు సముదాయంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు రుణం పెండింగ్‌లో ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీకి అవకాశమున్న సివిల్, క్రిమినల్, ఎక్సైజ్ తదితర కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు



ముదిగుబ్బ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చంద్రపై పోక్సో కేసు నమోదైంది. ఆటో డ్రైవర్ తన గ్రామంలోనే ఉంటున్న బాలికపై కన్నేశాడు. రోజూ వెంటపడుతూ లైంగికంగా వేధించేవాడు. బాలిక తిరస్కరించినా అతని పద్ధతిలో మార్పు రాలేదు. విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆటోడ్రైవర్ చంద్రపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ యతీంద్ర తెలిపారు.

డాక్టర్ కల.. పెరుగుతోందలా..

- వైద్య వృత్తికి డిమాండ్
- జిల్లా నుంచి ఏటా 'నీట్' రాసే వారు పెరుగుతున్న వైనం
- సీటు సంపాదించడం కష్టమైనా వెనక్కు తగ్గని యువత
- ఎంబీబీఎస్‌తోనే కాదు.. పీజీ వైద్యవిద్యకూ ముందుకు

మార్కెట్‌లో నేడు వైద్యులకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఒకసారి బాగా వైద్యం చేస్తారని పేరు వస్తే ఇక కాసుల వర్షం కురిసినట్లే. అందుకే అలాంటి డాక్టర్ వృత్తిలో స్థిరపడాలని జిల్లా యువత ఉవ్విళ్లూరుతున్నారు. జాతీయ స్థాయిలో లక్షల సంఖ్యలో పోటీ పడే 'నీట్'కు దరఖాస్తు చేస్తున్నారు. దేశంలో ఏ ప్రాంతంలో సీటు వచ్చినా, అక్కడికే వెళ్లి మరీ వైద్య విద్య అభ్యసిస్తున్నారు.

అనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల



సాక్షిప్రతినిధి, అనంతపురం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మెడిసిన్ ప్రవేశ పరీక్షలను తొలగించి కొన్నేళ్లుగా జాతీయ స్థాయిలో నీట్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా నీట్ రాసే వారి సంఖ్య పెరుగుతోందే కానీ తగ్గడం లేదు. ఏటా ఉమ్మడి జిల్లా నుంచి 7 వేల మంది వరకూ 'నీట్' రాస్తున్నారు. ఏటా 300 మందికి పైగానే ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో చేరుతున్నారు. అనంతపురం వైద్య కళాశాలలో 150 సీట్లు మాత్రమే ఉన్నా, పోటీ పడి మరీ సీటు సంపాదించుకుంటున్నారు.

సంప్రదాయ పద్ధతులకు స్వస్తి
మెడిసిన్ సీటు సంపాదించడం సవాలుతో కూడుకున్నది, జీవితంలో స్థిరపడడం చాలా కష్టం తదితర సందేహాలెన్నో గతంలో తల్లిదండ్రులకు ఉండేవి. కానీ, మారిన పరిస్థితులకు అనుగుణంగా వారు కూడా మారారు. సంప్రదాయ ఆలోచనలకు స్వస్తి చెబుతూ తమ పిల్లలను మెడిసిన్ విద్య వైపు ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలోనే పిల్లలు తమ తల్లిదండ్రుల అండదండలతో ఎలాగైనా సీటు సాధించి, ఇతర రాష్ట్రాల్లో అయినా ఎంబీబీఎస్ పూర్తి చేస్తున్నారు. మన రాష్ట్రంలో సీటు దొరకని ఎంతోమంది వైద్య విద్యార్థులు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి వైద్యవిద్య చదువుతున్నారు. ఒక ఏడాది సీటు రాకపోయినా రెండో ఏడాదైనా పోరాడి సీటు తెచ్చుకుంటుండడం గమనార్హం. తమ సొంతూరిలో డాక్టరుగా స్థిరపడాలనే లక్ష్యంతో కొందరు అడుగులేస్తుంటే, మరికొంత మంది విదేశాలకు వెళ్లి బాగా సంపాదించవచ్చనే ఆశతో మెడిసిన్ పూర్తి చేస్తున్నారు.

పీజీ వైపూ పరుగులు..
ఎంబీబీఎస్ కోర్సుతో సరిపెట్టుకునే వారు చాలా తక్కువగా ఉంటున్నారు. పీజీ చదివితేనే మార్కెట్‌లో నిలదొక్కుకుంటామనుకుని భావించి కళాశాలల్లో సీట్లు దక్కించుకునేందుకు సివిల్స్ స్థాయిలో పోటీపడుతున్నారు. జాతీయ స్థాయిలో సీట్లు పరిమితంగానే ఉండి పోటీ తీవ్రంగా ఉంటున్నా, అహర్నిశలు కష్టపడుతున్నారు. ప్రైవేటులో సీట్లు రూ.కోట్లు పలుకుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలల్లో సాధారణ బ్రాంచిలో సీటు దొరికినా చేరిపోతున్నారు. ఉదాహరణకు గుంతకల్లు పట్టణానికి చెందిన అభినవ్ తనకు ఆర్థోపెడిక్స్ చదవాలని కోరిక ఉన్నా, పరీక్షలో వచ్చిన మార్కుల కారణంగా అనస్తీషియా రావడంతో హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో చేరినట్లు తెలిసింది. అయితే, ఎక్కువ మంది ఎంబీబీఎస్ పూర్తి చేశాక సర్జరీ లాంటి ప్రాముఖ్యత ఉన్న విభాగాల వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం.

ఏటా జిల్లాలో నీట్ రాసే వారు	6 వేల నుంచి 7 వేలు
సీట్లు పొందుతున్న వారు	300 మందికి పైనే
సగటున ప్రభుత్వ సీట్లు పొందుతున్న వారి సంఖ్య	60 నుంచి 70
ప్రస్తుతం జిల్లాలో ఎంబీబీఎస్ వైద్యులు	2 వేల మంది పైనే
జిల్లాలో పీజీ వైద్య విద్య పూర్తి చేసిన వారు	400 పైనే
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న వైద్యులు	450 మంది పైనే

రెండో ప్రయత్నంలో సీటు కొట్టా



విద్యార్థి దశలోనే డాక్టర్ కావాలనే లక్ష్యం ఏర్పడింది. అదే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పా. వారి నుంచి సానుకూల స్పందన వచ్చింది. నీట్ మొదటిసారి రాసినప్పుడు త్రుటిలో అవకాశం చేజారింది. నిరాశ చెందక రెండో ప్రయత్నంలో సీటు సాధించా. రాష్ట్రంలోని పేరొందిన కళాశాలల్లో అనంతపురం వైద్య కళాశాల ఒకటి. ఇక్కడ అధ్యాపకులు, కళాశాల వాతావరణం చాలా బాగుంది. ఎంబీబీఎస్ అయ్యాక కచ్చితంగా స్పెషలైజేషన్ చేస్తా.
– గ్రీష్మ, ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్, హైదరాబాద్

మరింత పట్టుకే పీజీ



ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ సర్వజనాస్పత్రి, ఆత్మకూరు, బుక్కరాయసముద్రంలో ప్రజలకు సేవలందించా. తల్లిదండ్రులు రామానాయక్, లక్ష్మి ప్రోత్సాహం, పీజీ చేయాలన్న కోరికతో రేడియాలజీ విభాగాన్ని ఎంచుకున్నా. రోగి వ్యాధి నిర్ధారణలో రేడియాలజీ ఎంతో కీలకం. ఆయా అంశాలపై పట్టు సాధించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తా. అనంతపురం వైద్య కళాశాలలో సానుకూల వాతావరణం ఉంది. ఇక్కడ విద్యనభ్యసిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.
– డాక్టర్ రజిత, అనంతపురం

పోటీతత్వంతోనే ఉన్నతస్థాయికి..



వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనది. విద్యార్థి దశ నుంచి మెడిసిన్ వరకు చదవడానికి పదేళ్లు పడుతుంది. తల్లిదండ్రుల ఆకాంక్ష, ప్రజలకు మంచి చేయాలన్న దృక్పథంతో ఎంతో మంది విద్యార్థులు పోటీ పడుతూ వైద్య వృత్తిలో చేరుతున్నారు. ఇటీవల కాలంలో పోటీ పెరిగినా.. నీట్ రాసే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. ఆ పోటీతత్వమే వారిని ఉన్నతస్థానానికి తీసుకెళ్తుంది.
– డాక్టర్ మాణిక్యరావు, ప్రిన్సిపాల్, అనంతపురం వైద్య కళాశాల

పొదుపు డబ్బు మింగిన యానిమేటర్ భర్త
కళ్యాణదుర్గం: మహిళలు తమ పొదుపు సంఘాల్లో దాచుకున్న డబ్బుల్ని ఓ యానిమేటర్ భర్త మింగేశాడు. సభ్యులకు అనుమానమొచ్చి నిలదీయడంతో బాగోతం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో సుమారు 30 వరకు గ్రామైఖ్య సంఘాలున్నాయి. యానిమేటర్‌గా లక్ష్మీ నరసమ్మను ఎంపిక చేసినా, ఆమెకు బదులు భర్త ఎర్రిస్వామి విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామ మహిళా సంఘాల సభ్యుల లావాదేవీలన్నీ కళ్యాణదుర్గంలోని సిండికేట్ బ్యాంక్ (కెనరా బ్యాంక్)లో జరుపుతున్నారు. ఒక్కో సంఘానికి వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ రుణాలు తీసుకున్నారు. రుణాన్ని ప్రతి నెలా కంతుల రూపంలో చెల్లిస్తూనే, వ్యక్తిగతంగా కొంత మొత్తం పొదుపు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తమ పొదుపు ఖాతాల నుంచి ఎవరో డబ్బు డ్రా చేస్తున్నట్లు గుర్తించిన మహిళలు.. సోమవారం మూకుమ్మడిగా సిండికేట్ బ్యాంక్ అధికారులను ఆశ్రయించగా, బాగోతం బయటపడింది. అధికారులు సదరు యానిమేటర్ భర్తను విచారించగా, డబ్బు కొట్టేసినట్లు ఒప్పుకున్నాడు. సంఘాల సభ్యులు పొదుపు వేసేందుకు, రుణం తీసుకునేందుకు వచ్చినప్పుడు నగదు విత్ డ్రా ఫారాలపై లీడర్లతో అదనంగా సంతకాలు చేయించుకుని, ప్రతి సంఘం నుంచి రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ చొప్పున దాదాపు రూ. 30 లక్షలు డ్రా చేసి, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు తెలిపాడు. దీంతో బాధితులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డబ్బు తిరిగివ్వకపోతే పోలీసుస్టేషన్‌లో కేసు పెడతామంటూ హెచ్చరించారు. కాగా, జరిగిన బాగోతంలో వెలుగు అధికారులు, బ్యాంక్ అధికారుల తప్పిదం ఉండటంతో రికవరీ చేయించేందుకు నానా తిప్పలు పడుతున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాల విడుదల
అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పరిధిలో మే నెలలో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ సెమిస్టర్ల ఫలితాలు విడుదలయ్యాయి. నాలుగో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ ఐదో సెమిస్టర్ (ఆర్–17), నాలుగో సెమిస్టర్, మూడో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

వేరుశనగకు ఫుల్ డిమాండ్!



పుట్టపర్తిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు



గోడౌన్‌లో నిల్వ చేసిన విత్తన కాయలు

- చెనక్కాయకు పెరుగుతున్న డిమాండ్
- ఇప్పటికే 82 వేల మంది రైతులకు అందజేత

పుట్టపర్తి అర్బన్‌: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులంతా సాగుకు సన్నద్ధమయ్యారు. ప్రధాన పంట వేరుశనగకే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా డిమాండ్ మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచి సబ్సిడీపై అందజేస్తోంది.

మందకొడిగా ప్రారంభమై...
జిల్లా మే 29వ తేదీన సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభమైంది. తొలుత మందకొడిగా ప్రారంభమైన విత్తన కాయల పంపిణీ వర్షాలు విస్తారంగా కురవడంతో డిమాండు పెరిగింది. మరోవైపు ప్రభుత్వం కూడా డిమాండ్ మేరకు విత్తన వేరుశనగను రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేసి ఉంచింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ నాణ్యమైన విత్తన వేరుశనగ అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు.

82 వేల మందికి విత్తనం అందజేత..
ఖరీఫ్ సీజన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ విత్తన కాయలు పంపిణీ చేశారు. జిల్లాలోని మడకశిర, పెనుకొండ, కదిరి, ధర్మవరం, హిందూపురం వ్యవసాయ డివిజన్ల పరిధిలో 416 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఉన్నాయి. ఆయా ఆర్బీకేల్లో 82,929 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారికి 71,339 క్వింటాళ్ల కే–6 రకం వేరుశనగ అందజేశారు. మడకశిర డివిజన్‌లో 15,188 మందికి 13,592 క్వింటాళ్లు, పెనుకొండ డివిజన్‌లో 7,149 మంది రైతులకు 6,073 క్వింటాళ్లు, కదిరి డివిజన్‌లో 32,905 మంది రైతులకు 28,830 క్వింటాళ్లు, ధర్మవరం డివిజన్‌లో 14,393 మంది రైతులకు 12,888 క్వింటాళ్లు, హిందూపురం డివిజన్‌లో 13,294 మంది రైతులకు 9,956 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా ఎవరికైనా విత్తన కాయలు కావాలంటే వెంటనే ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

కళ్ల ముందే చెదిరిన కలలు

- నీటి కుంటలో పడి భర్త, కుమారుడి మృతి
- తన ఎదుటే ఇద్దరి మృతితో తల్లడిల్లిన ఇల్లాలు




రాజగోపాల్, వశిష్ట మృతదేహాలు



ప్రమాదానికి కారణమైన నీటి కుంట

ఆత్మకూరు: ఎదిగొస్తున్న కుమారులను చూస్తూ ఆ ఇల్లాలు ఎంతో మురిసిపోయేది. రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్న భర్తతో పిల్లవాళ్లను బాగా చదివించాలంటూ రోజూ చెప్పేది. కానీ, ఆ మహిళ కలలను ఊహించని ప్రమాదం కల్లలు చేసింది. కంటి పాపని, ఇంటి పెద్దని 'మింగి' తీరని దుఃఖం మిగిల్చింది. దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వెళ్తున్న క్రమంలో తండ్రి, కుమారుడు మరణించిన విషాద ఘటన మండలంలోని వడ్డుపల్లి సమీపంలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నాల్గో రోడ్డుకు చెందిన రాజగోపాల్ (38), అపర్ణ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. వ్యాపారం చేసుకుంటూ రాజగోపాల్ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై ఆత్మకూరు మండలం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భార్య, చిన్న కుమారుడు వశిష్టతో కలిసి వచ్చారు. స్వామి దర్శనానంతరం సమీపంలోని సిటీ పార్కులో అందరూ ఆనందంగా గడిపారు. తిరుగు ప్రయాణంలో వడ్డుపల్లి వద్ద ఉన్న టోల్ గేట్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఆపారు. ఈ క్రమంలోనే వశిష్ట అక్కడికి సమీపంలోని ఓ కుంట దగ్గరకు వెళ్లాడు. కాలు జారి నీటిలో పడిపోయాడు. పిల్లాడి అరుపులు విన్న రాజగోపాల్ వెంటనే నీటిలో దూకాడు. ఈత రాకపోవడంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. అటుగా వెళ్తున్న వాహనదారుల సాయంతో అపర్ణ భార్త, కుమారుడిని బయటకు తీశారు. వెంటనే 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకురాగా, అప్పటికే ఇద్దరూ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళ్ల ముందే ప్రాణాల కోసం కొట్టుమిట్టాడిన వారిని చూసి అపర్ణ తీవ్రంగా రోదించింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

శ్రావణంలోనే పప్పన్నం!

- శుక్రమూఢంతో వివాహాలకు బ్రేక్
- జూలై 8 వరకు శుభకార్యాలకు అడ్డంకి
- ఆగస్టు 7 తర్వాతే శుభ ముహూర్తాలు
- మళ్లీ సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 3 వరకూ శూన్యమాసం

పెళ్లిబాజా మోగాలంటే శ్రావణం వరకూ ఆగాల్సిందే. ఏప్రిల్ 28 నుంచి వరుసగా మూఢమి రావడంతో శుభకార్యాలకు ఆటంకం కలిగింది. రెండున్నర నెలలుగా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాల వంటివన్నీ నిలిచిపోయాయి. మళ్లీ ఆగస్టు 5వ తేదీ తర్వాత శ్రావణంలో మూడుముళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.



ధర్మవరం అర్బన్‌: క్రోధి నామ సంవత్సరంలో ఏప్రిల్ 9 తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. 26వ తేదీ (చైత్ర మాసం) వరకూ మంచి ముహూర్తాలు ఉండటంతో జిల్లా వ్యాప్తంగా వేలాది శుభకార్యాలు జరిగాయి. ఆ తర్వాత ఏప్రిల్ 28వ తేదీ (చైత్ర చవితి) నుంచి జూలై 8వతేదీ (ఆషాఢ శుద్ధ తదియ) వరకూ శుక్ర మౌఢ్యమి (మూఢం) నడుస్తోంది. దీంతో ఆయా రోజుల్లో ముహూర్తాలు లేక శుభకార్యాలు ఆగిపోయాయి. ఆ తర్వాత కూడా మే 7వ తేదీ నుంచి (చైత్ర బహుళ చతుర్థి) జూన్ 7వ తేదీ వరకూ గురు మౌఢ్యమి నడిచింది. వరుసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా శుభకార్యాలకు ఆటంకం ఏర్పడింది.

ఆషాఢం కూడా ముహూర్తాల్లేవ్..
జూలై 5వ తేదీ నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ ఆషాఢ మాసం ఉంటుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈనెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాల వంటి శుభకార్యాలు నిర్వహించరు. మొత్తమ్మీద ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పెళ్లి బాజాలు మోగే అవకాశం లేదని పురోహితులు చెబుతున్నారు. మూఢంలోని మంచిరోజుల్లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్ల వంటి పనులు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇక సెప్టెంబర్ 4వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ భాద్రపదం కూడా శూన్యమాసం కావడంతో ఆ నెలలోనూ వివాహాల ముహూర్తాలు ఉండవు.

శ్రావణ మాసంలోనే...
శ్రావణ మాసం ఆగస్టు 7వ తేదీ నుంచి ప్రారంభమై 28వ తేదీ వరకూ నడుస్తుంది. ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. ఆగస్టు 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ ముహూర్తాలు ఉన్నాయి. వాటిలో 5, 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో శుక్ర, మంగళవారాలు మినహా అన్ని రోజులూ దివ్యమైన ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు.

ఉపాధికి గండి..
గత రెండున్నర నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి మారాయి. దీంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కేవలం శుభకార్యాలపైనే ఆధారపడి ఎన్నో వృత్తులవారు జీవనం సాగిస్తున్నారు. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవాళ్లు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ట్రావెల్స్, అద్దె కార్లు, బస్సులు, ఐక్రీమ్, మినరల్ వాటర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు, పూలు, డెకరేషన్స్, లైటింగ్, కూరగాయలు, కిరాణ, వస్త్రదుకాణాలు, బంగారు, వెండి వ్యాపారాలు, టెంట్ హౌస్‌లు, మాంసపు దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులు తదితర వారికి పని లేకుండా పోయింది. మరెంతో మంది రోజువారీ కూలీలకూ ఉపాధి కొరవడింది. అడపాదడపా చిన్న చిన్న ఫంక్షన్లు వస్తున్నా... పెళ్లిళ్లు అయితేనే తమకు గిట్టుబాటు అవుతుందని ఆయా వర్గాల వారు చెబుతున్నారు. ఆగస్టు 7వతేదీ వరకూ ఎదురు చూడాల్సిందేనని పేర్కొంటున్నారు.

శ్రావణంలోనే ముహూర్తాలు



గురు, శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు 70 రోజుల పాటు నిలిచిపోయాయి. ఆగస్టు 7 నుంచి ప్రారంభమయ్యే శ్రావణ మాసంలో నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహూర్తాలున్నాయి. సెప్టెంబర్‌లో మళ్లీ భాద్రపదం శూన్యమాసం కావడం వల్ల వివాహ ముహూర్తాలు ఉండవు.
– ద్వారకనాథ్ శర్మ, పురోహితులు, ధర్మవరం

క్లుప్తంగా

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి : డీఎంఓ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ కుళ్లాయప్పనాయక్

తాడిమర్రి: రికార్డులు నిర్వహణ సక్రమంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ ఆదేశించారు. తాడిమర్రిలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ... ఈ నెల 12న పీహెచ్‌సీ పరిశీలనకు ఎన్‌క్వాష్ బృందం రానుందన్నారు. ఈ క్రమంలో రికార్డులన్నీ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బృందం పరిశీలనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తరాదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హరిత, గోవర్ధననాయుడు, సిబ్బంది హేమలత, రామ్‌కుమార్, నారాయణమ్మ, లక్ష్మీదేవి, మస్తాన్ పాల్గొన్నారు.

దుప్పి మృతి



దుప్పి కళేబరాన్ని దహనం చేస్తున్న దృశ్యం

తనకల్లు: మండలంలోని పెద్దపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఓ దుప్పి మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి తీవ్ర గాయాలతో వచ్చిన దుప్పి గ్రామ శివారులో చతికిలబడింది. విషయాన్ని గమనించిన స్థానికుల సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకునేలోపు దుప్పి మృతి చెందింది. దుప్పి కళేబరాన్ని కొక్కంటి క్రాస్‌లోని అటవీశాఖ నర్సరీకి తరలించి, పంచనామ అనంతరం దహనం చేశారు. కాగా, ఏదైనా అడవి జంతువు దాడిలో దుప్పి గాయపడిందా? వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని గాయపడి మృతి చెందిందా అనేది తెలియాల్సి ఉంది.

రిజర్వాయర్‌లో పడి విద్యార్థి మృతి



సంతోష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీకి చెందిన ఉప్పర సంతోష్ బాబు(18) సోమవారం ఉదయం తన స్నేహితులతో కలసి గొల్లపల్లి రిజర్వాయర్‌ను చూసేందుకు వెళ్లాడు. పరిసరాలు చూసొచ్చిన అనంతరం స్నేహితులు రిజర్వాయర్‌లో ఈత కొడుతుండగా, సంతోష్ బాబు ఒడ్డున కూర్చొని అందరినీ ఉత్సాహపరుస్తూ అదుపు తప్పి ఒక్కసారిగా నీటిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టి సంతోష్‌బాబు మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రంగడు తెలిపారు.

జీవాలకు కేరాఫ్ కొత్తచెరువు

- జిల్లాకే తలమానికంగా మార్కెట్ యార్డు
- కర్ణాటక, తమిళనాడుకు జీవాల ఎగుమతి



క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్న కొత్తచెరువు మార్కెట్ యార్డు



అమ్మకానికి తీసుకువచ్చిన గొర్రెల మంద

పుట్టపర్తి అర్బన్: మేకలు, గొర్రెల క్రయవిక్రయాల ద్వారా అధిక లాభాలు ఆర్జిస్తూ రాయలసీమలోనే ప్రత్యేక స్థానాన్ని కొత్తచెరువు మార్కెట్ యార్డు దక్కించుకుంది. ఈ ప్రాంతంలో మేతకు కొదవ లేకపోవడంతో జీవాలు బలిష్టంగా ఉంటున్నాయి. దీంతో ఇక్కడి జీవాల కొనుగోలుకు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పోటీ పడుతుంటారు.

లక్ష్యానికి మించి ఆదాయం..

జిల్లాలో ఉన్న గ్రేడ్ 1 మార్కెట్లలో కదిరి, గోరంట్ల, ధర్మవరం మార్కెట్ యార్డులను తలదన్నుతూ లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని కొత్తచెరువు మార్కెట్ యార్డు గడిస్తోంది. ఉమ్మడి జిల్లాలో జీవాల క్రయవిక్రయాల్లో అనంతపురం తర్వాతి స్థానం కొత్తచెరువుదే కావడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో కొత్తచెరువు మార్కెట్ యార్డుకు రూ.45 లక్షల ఫీజు వసూళ్లు లక్ష్యంగా నిర్దేశించగా రూ.72 లక్షల వసూళ్లతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానంలో రూ.60 లక్షల నిర్దేశిత లక్ష్యంలో రూ.70 లక్షల వసూళ్లతో కదిరి రెండో స్థానంలో నిలిచింది. రూ.45 లక్షలకు గాను రూ.52 లక్షల వసూళ్లతో ధర్మవరం మూడో స్థానం, నిర్దేశించిన రూ.60 లక్షల కన్నా తక్కువగా రూ.58 లక్షల వసూళ్లతో చివరి స్థానంలో గోరంట్ల మార్కెట్ యార్డు నిలిచింది.

పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి..

జిల్లాలో చాలా మంది రైతులు వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా జీవాల పోషణ చేపట్టి లాభాలు గడిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పుట్టపర్తి నియోజకవర్గంలో జీవ సంపద ఉంది. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో పదుల సంఖ్యలో గొర్రెల మందలు కనిపిస్తుంటాయి. విస్తారమైన అటవీ భూముల్లో మేతకు కొదవ లేకపోవడంతో ఇక్కడి జీవాలు చాలా బలిష్టంగా ఉంటాయి. దీంతో ప్రతి బుధవారం జరిగే కొత్తచెరువు మార్కెట్‌కు తమ జీవాలను తరలించి రైతులు విక్రయాలు సాగిస్తున్నారు. ఆరోగ్యకరంగా, బలంగా ఉన్న జీవాల కొనుగోలుకు కర్ణాటకలోని బెంగళూరు, బాగేపల్లి, గౌరీబిదనూరు, చిక్కబళ్లాపుర, చింతామణి, పేరేసంద్రతో పాటు తమిళనాడు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పోటీ పడుతుంటారు. తాము కొనుగోలు చేసిన జీవాలను ప్రత్యేకంగా లారీల ద్వారా ఇక్కడి నుంచి తరలిస్తుండడం గమనార్హం.

అన్ని సౌకర్యాలు కల్పించాం



సుదూర ప్రాంతాల నుంచి జీవాలను తీసుకువచ్చే కాపర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పించాం. నిర్దేశిత రోజు కంటే ముందే వచ్చినా బస చేసేందుకు ప్రత్యేకంగా షెల్టర్ ఏర్పాటు చేస్తున్నాం. సమృద్ధిగా నీళ్లు, మందలు విడిచిచేందుకు విశాలమైన ప్రాంగణాన్ని కేటాయించాం. ధర్మవరం-బెంగళూరు ప్రధాన రహదారి పక్కనే సుమారు 7 ఎకరాల్లో మార్కెట్ విస్తరించి ఉండడంతో వ్యాపార లావాదేవీలకు ఎంతో అనుకూలం. – వెంకటేష్, సెక్రెటరీ, కొత్తచెరువు మార్కెట్ యార్డు

అభివృద్ధి చేయాల్సి ఉంది



జిల్లాలోనే అత్యధిక లాభాలు ఆర్జిస్తున్న కొత్తచెరువు మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది. గదులు, కోల్డ్ స్టోరేజీ, మందుల నిల్వకు అవసరమైన గది నిర్మాణానికి అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రధాన రహదారి పక్కన ఉండడంతో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే ఆదాయం మరింత పెరుగుతుంది. – శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్, కొత్తచెరువు

జీ హుజూర్ అంటున్న అధికారులు

- కొత్త ఎమ్మెల్యేల చుట్టూ పోలీసుల ప్రదక్షిణలు
- బదిలీలకు ఊపందుకున్న పైరవీలు

హిందూపురం అర్బన్: గెలిచిన ఎమ్మెల్యేల చూపంతా ప్రస్తుతం పోలీస్ శాఖపై పడింది. తమకు అనుకూలంగా ఉన్న వాళ్లకు పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు నేతలు ఇప్పటికే జాబితాలు సిద్ధం చేసినట్లు సమాచారం. మరో పక్క ఆశావహులు సైతం మంచి స్టేషన్లు, సబ్ డివిజన్ల కోసం పైరవీలు ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ సీనియర్ ఇన్‌స్పెక్టర్ల మొదలు ఎస్‌ఐల వరకు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు ఇప్పటికే జాబితాలు సిద్ధం చేయగా.. మరి కొందరు తమకున్న పరిచయాల ఆధారంగా గతంలో తమకు అనుకూలంగా వ్యవహరించిన అధికారులు ఎక్కడ ఉన్నారో ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రాప్తాడు, పుట్టపర్తి, కదిరి, హిందూపురం నియోజకవర్గాల్లో పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు ఆయా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు ఎగబడుతున్నారు. తమకు ఫలానా చోట పోస్టింగ్ ఇప్పించాలని నేరుగా కోరకుండా.. పూల బొకే చేతిలో పెట్టి శుభాకాంక్షలు చెబుతున్నారు. గతంలో తాము పని చేసిన ప్రాంతం, జీ హుజూర్ అంటూ అప్పటి ప్రతిపక్ష టీడీపీకి విధేయులుగా తాము చేసిన పనులు వివరించి ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. హిందూపురం ఎమ్మెల్యేగా ముచ్చటగా మూడోసారి ఎన్నికైన బాలయ్య సైతం ఇప్పటికే తన వ్యక్తిగత కార్యదర్శుల ద్వారా గతంలో ఈ ప్రాంతంలో పనిచేసిన అధికారులు ఎక్కడున్నారో ఆరా తీసినట్లు సమాచారం. వారు ఇక్కడకు వచ్చేందుకు సుముఖంగా ఉన్నారో లేదో తెలుసుకోవాలని సూచనలు చేసినట్లు తెలిసింది. పుట్టపర్తిలోనూ తనకు అనుకూలంగా గతంలో పని చేసిన వారిని మళ్లీ ఏరికోరి అక్కడికి రప్పించుకునే పనిలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ఉన్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో తనకు వ్యతిరేకంగా వ్యవహరించిన పోలీసులపై కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో ఆయా అధికారులను అక్కడి నుంచి తప్పించాలంటూ ఇప్పటికే అధికారులకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు శ్రీరామ్ కూడా ఇదే పంథాలో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా పోలీస్‌శాఖతో పాటు, రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ తమకు అనుకూలంగా ఉన్న అధికారులను రప్పించుకునే పనిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు పావులు కదుపుతుండగా, వారిని ప్రసన్నం చేసుకునేందుకు అధికారులు బారులు తీరుతుండడం గమనార్హం.

పట్టపగలే దోపిడీ దొంగల బీభత్సం

- గృహిణిపై దాడి
- 12 తులాల బంగారు నగల చోరీ



బాధితురాలు సరోజమ్మతో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దననాయుడు

తాడిపత్రి: పట్టణంలో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఇంట్లోకి చొరబడి గృహిణిపై బ్లేడుతో దాడి చేసి విలువైన బంగారు నగలు అపహరించుకెళ్లారు. బాధితురాలు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని కేవీరెడ్డి నగర్‌లో నివాసముంటున్న ఓ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ దస్తగిరి భార్య సరోజమ్మ సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఒక్కతే ఉంది. విషయాన్ని పసిగట్టిన ఇద్దరు ఆగంతకులు వరండాలోకి చేరుకుని అన్నా... అన్నా అంటూ పిలిచారు. దీంతో వారి వద్దకు సరోజమ్మ వెళ్లి ఎవరని ప్రశ్నిస్తుండగా ఆమెను బలంతంగా ఇంట్లోకి నెట్టి లోపలకు చొరబడ్డారు. అనంతరం తమ వద్ద ఉన్న బ్లేడుతో ఆమె చేతులు కోశారు. గట్టిగా కేకలు పెడితే హతమారుస్తామంటూ బెదిరిస్తూ తలను నేలకేసి బాదారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న 4 తులాల బంగారు గొలుసు, 2 తులాల పూసల చైన్, 6 తులాల బరువున్న ఆరు బంగారు గాజులు లాక్కొని ఉడాయించారు. దాడి నుంచి తేరుకున్న అనంతరం సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జనార్దననాయుడు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. దోపిడీ జరిగిన తీరుపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై రౌడీషీట్

అనంతపురం: అధికారం అండ చూసుకుని రెచ్చిపోయిన ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై పోలీసులు రౌడీ షీట్ ఓపెన్ చేశారు. వివరాలు... అనంతపురంలోని 49 వార్డు సచివాలయం శిలాఫలకాన్ని సోమవారం పలువురు టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. అనంతరం సచివాలయంలోకి వెళ్లి ప్రభుత్వ కరపత్రాలను దగ్ధం చేస్తూ ఉద్యోగులపై విరుచుకుపడ్డారు. అందరూ అక్కడి నుంచి వెళ్లిపోవాలని, సచివాలయానికి తాళం వేస్తున్నామని, తమ ప్రభుత్వం వచ్చింది కాబట్టి తమ వాళ్లే అక్కడ ఉద్యోగం చేస్తారంటూ హుకుం జారీ చేస్తూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేశారు. అయితే స్థానికుల నుంచి అప్పటికే సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న నగర టూ టౌన్ సీఐ క్రాంతికుమార్ అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంతో పాటు సాకే జయప్ప, సాకే రవితేజ, శ్రీకాంత్‌పై రౌడీ షీట్ నమోదు చేశారు. కాగా, ఘటనలో పాల్గొన్న అందిరపై రౌడీషీట్ తెరవాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. టీడీపీ శ్రేణుల అరాచకాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు తీసుకున్న చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల గోదామును పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

యాడికి: అనుమతి పొందిన కంపెనీల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయాలు సాగిస్తూ, ప్రతి అమ్మకానికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఎరువుల దుకాణాల నిర్వాహకులకు గుత్తి ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. సోమవారం యాడికిలోని వెంకట్ ఫర్టిలైజర్ దుకాణం, గోదామును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నిల్వలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 4 రకాల పత్తి విత్తనాల అమ్మకాన్ని నిలిపి వేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సరైన ఆధారాలు లేని రూ.5లక్షల విలువ గల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఎరువుల దుకాణ యజమానులు లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని, మార్గదర్శకాలను డీలర్లు పాటించకపోతే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

‘నీట్’ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్ బాబు డిమాండ్



మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) ఇటీవల విడుదల చేసిన ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు చెందిన వారు కావడంపై అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాదిమంది ప్రతిభగ ల విద్యార్థులు వైద్య విద్యకు దూరం కాకుండా ఉండాలంటే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లు చేస్తూ అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నగర నాయకులు హరికృష్ణ, రారాజు, పవన్, హర్ష, సమీర్, శేఖర్, వరుణ్, తరుణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ



సుధై నందన్‌రెడ్డి

గాండ్లపెంట: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో గాండ్లపెంట మండల విద్యార్థి ప్రతిభ చాటాడు. పోరెడ్డివారిపల్లికి చెందిన సామాల హరినాథ్‌రెడ్డి కుమారుడు సామాల సుధై నందన్‌రెడ్డి జాతీయ స్థాయిలో (సీఆర్‌ఎల్) 3,170 ర్యాంక్, కేటగిరి విభాగంలో 325వ ర్యాంక్ సాధించాడు. పదో తరగతి వరకూ అనంతపురంలో, ఇంటర్మీడియెట్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివాడు. నిర్దిష్టమైన ప్రణాళిక, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహమే తన విజయానికి కారణమని సుధై నందన్‌రెడ్డి తెలిపారు.

అంతర్జాతీయ చెస్ టోర్నీ విజేతగా ‘పురం’ వాసి



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారుడు అఫ్రిద్ ఖాన్

హిందూపురం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరం వేదికగా ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకూ జరిగిన అంతర్జాతీయ ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా హిందూపురానికి చెందిన క్రీడాకారుడు అఫ్రిద్ ఖాన్ నిలిచాడు. ఈ మేరకు కోచ్ ఆరీఫ్ వుల్లా సోమవారం తెలిపారు. అంతర్జాతీయ ఓపెన్ చెస్ పోటీలకు 270 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు హాజరు కాగా, 10 మ్యాచ్‌ల్లో ఆరు మ్యాచ్‌లను అఫ్రిద్ ఖాన్ గెలిచాడని, మరో నాలుగు మ్యాచ్‌లో డ్రా అయ్యాయని వివరించారు. మొత్తం 8 పాయింట్లతో టోర్నీ విజేతగా నిలిచిన అఫ్రిద్ ఖాన్‌ను అభినందిస్తూ ట్రోఫీతో పాటు రూ.60వేల నగదును ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సెక్రటరీ భీమారావు, చీఫ్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్ నాయుడు అందజేశారన్నారు.

‘నీట్’ అక్రమాలపై తక్షణమే చర్యలు చేపట్టాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ‘నీట్’ ఫలితాల్లో చోటు చేసుకున్న అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఏ (ఐసా) నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఏ జాతీయ కమిటీ పిలుపు మేరకు సోమవారం అనంతపురంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ... నీట్ పేపర్ లీక్ వార్త, ఫలితాల్లో అవకతవకల కారణంగా దేశంలోని లక్షలాది మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పేపర్ లీకేజీకి సంబంధించి బీహార్‌లో 13 మందిని అరెస్ట్ చేశారన్నారు. ఏటా ఇద్దరు, ముగ్గురు, నలుగురు మాత్రమే టాప్ విద్యార్థులు ఉండేవారన్నారు. కానీ ఈసారి 720కి 720 మార్కులు సాధించి 67 మంది విద్యార్థులు టాప్ లిస్ట్‌లో ఉండడం అనుమానాలకు దారి తీస్తోందన్నారు. నీట్ ఫలితాలపై వస్తున్న ఆరోపణల్లో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

రైళ్ల సగటు వేగాన్ని పెంచేలా చర్యలు తీసుకోండి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్



వీసీలో మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్

గుంతకల్లు: ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్ల సమయ పాలనను మెరుగుపరచాలని, రైళ్ల సగటు వేగాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. జోనల్‌లోని డీఆర్‌ఎంలతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రైలు రాకపోకలు, భద్రతపై సమీక్షించారు. రైలు సురక్షితంగా నడిపేందుకు భద్రతకు సంబంధించిన విధివిధానాలను కచ్చితంగా పాటించాలన్నారు. తరచూ భద్రతపై లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, పర్మినెంట్ వే మెయింటెనెన్స్, రన్నింగ్ సిబ్బందికి అవగాహన కల్పిస్తుండాలన్నారు. ఇంజనీరింగ్, మెకానికల్, సిగ్నలింగ్ విభాగాలకు చెందిన పరికరాలు, తదితర వస్తువులు లభ్యతపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలన్నారు. సిబ్బందికి విశ్రాంతి వేళలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో గుంతకల్లు నుంచి డీఆర్‌ఎం వినీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు, ఆర్‌బీకేల శిలాఫలకాల ధ్వంసం



సచివాలయ శిలాఫలకం పగులగొట్టిన దృశ్యం



రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నంలోని 1, 2 గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే శిలాఫలకాలను ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. రూ.80 లక్షల వ్యయంతో రెండు సచివాలయాలు, రూ.30 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించింది. ప్రభుత్వం మారిన వెంటనే టీడీపీ నాయకులు దాడులు చేసి విధ్వంసానికి పూనుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయాలు చేశాం

- పారిపోవాల్సిన అవసరం మాకు లేదు
- నియోజకవర్గ ప్రజలకు ‘తోపుదుర్తి’ కుటుంబం అండగా ఉంటుంది
- ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి
- లేదంటే ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడతాం
- వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

రాప్తాడు రూరల్: ‘గడిచిన ఐదేళ్లు రాప్తాడు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయాలు చేశాం. తోపుదుర్తి కుటుంబం ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటుంది’ అని రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే తోపుదుర్తి సోదరులు పారిపోయారంటూ ఎల్లో మీడియా ప్రచారం చేస్తుండడాన్ని తప్పుబట్టారు. కథనాలను ఖండించారు. తోపుదుర్తి కుటుంబం ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు గెలిచిన తర్వాత పరిటాల కుటుంబం దృష్టి సారించకుండా గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను రెచ్చగొట్టేలా అనుకూల మీడియాలో కథనాలు ప్రచురితం చేయిస్తోందని మండిపడ్డారు. టీడీపీకి వ్యతిరేకంగా ఉన్నామనే కక్షతో దాదాపు 30 ఏళ్లుగా తమ కుటుంబాన్ని ప్రజల్లో విలన్లుగా చిత్రీకరించే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ప్రజలను, ప్రజాస్వామ్యవాదులను భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం అవివేకం అన్నారు. ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్‌ను రూపుమాపేందుకు తోపుదుర్తి కుటుంబం నిరంతరం పని చేసిందన్నారు. కేవలం పరిటాల సునీతను గెలిపించేందుకు తమ కుటుంబాన్ని విలన్లుగా చిత్రీకరిస్తూ 500 కథనాలు ఎల్లో పత్రికల్లో ప్రచురితమైతే... మరో 150 ఎపిసోడ్లు ఎల్లో మీడియాలో ప్రసారమయ్యాయని గుర్తు చేశారు. ఇప్పటికే ఎల్లో మీడియా తమ కుటుంబంపై దుష్ప్రచారం కొనసాగిస్తోందన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం ద్వారా గెలిచారనే అనుమానాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్నాయన్నారు. ఏది ఏమైనా ప్రజా తీర్పునకు తాము కట్టుబడి ఉన్నామని, తమ కార్యకర్తలకు అండగా ఉంటామని, ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని తోపుదుర్తి చందు స్పష్టం చేశారు.